రంగుల కల

భమిడిపాటి జగన్నాథరావు

కామేశ్వరరావుకూ, నాకూ ఇరవై ఏళ్ళ పైగా పరిచయం. ఆ పరిచయం పరిచయంగానే ఉండిపోయింది కాని, స్నేహంగా మారలేదు. మారడానికి అవకాశమూ లేదు. అతనూ, నేనూ ఏనాడూ ఒక ఊళ్ళో కలిసి పనిచెయ్యలేదు. ఆఖరికి పట్టుమని కొన్నిరోజులైనా కలిసి ఉండలేదు. కాని అతను సంవత్సరానికో, సంవత్సరంన్నరకో, ఆపైనో ట్రెయిన్‌లోనో, బస్సు ప్రయాణాల్లోనో, పెళ్ళిళ్ళలోనో, సినిమాహాల్లోనో, ఎగ్జిబిషన్స్‌లోనో కనబడేవాడు.

చిత్రవేవిటంటే అతను కనిపించినప్పుడల్లా మా ఇద్దరి మధ్యా సంభాషణ ఒక విషయం మీదే నడిచేది.

'మీ 'పాప' ఎలా వుంది?' అని నేనడగడం, అతను మురిసిపోతూ వాళ్ళ అమ్మాయి 'లక్ష్మి' చేష్టలూ, అల్లరి, చదువూ వగైరా చెప్పడం.

ఇంకో చిత్రం– మా సంభాషణలో ఆ పిల్లని 'పాప' అని నేను, అసలు పేరు 'లక్ష్మి' అని అతనూ అనడం అలవాటైపోయింది.

అసలు మేమిద్దరం ఇరవైఏళ్ళక్రితం మొదటిసారిగా కలుసుకున్నప్పటి తీరూ, సంభాషణా కూడా చిత్రంగానే సాగింది.

మా కజిన్ రామం ఓరోజు ఈ కామేశ్వర్రావుతో మా ఇంటికి వచ్చాడు. అతడు లావుగా, పెద్ద సైజులో వున్నాడు. వయసు చిన్నదైనా ఆకారం మాత్రం వికృతంగా పెరిగింది. ఆనాడు నేను కలిసినపుడు అతను జీవితంలో ఉత్సాహం నశించినవాడులా వున్నాడు.

పరిచయాలయ్యాక మా రామం అసలు సంగతి బైటపెట్టి నీకు ఫలానా ఆ పెద్ద ఆఫీసరు బాగా తెలుసు కనుక కామేశ్వర్రావును 'ఆ' వూరు బదిలీ చేయించమన్నాడు.

'మీది 'ఆ'వూరు స్వగ్రామమా!' అన్నాను.

'కాదు' అన్నాడు ముభావంగా కామేశ్వర్రావు.

'మరి అక్కడికే ఎందుకు బదిలీ?'

ఇద్దరూ మాట్లాడలేదు. మావాడు ఏదో చెప్పబోయి సంశయిస్తున్నట్టు ఆగిపోయాడు.

ఉన్నట్టుండి కామేశ్వర్రావన్నాడు. 'ఆ వూళ్లో ప్రకృతి ఆశ్రమం వుంది. అక్కడ వైద్యం చేయించుకుంటే పిల్లలు వుడతారని'

అనడం నా కళ్ళల్లోకి దీనంగా చూస్తూ అన్నాడు. అతని సమాధానం, ఆ మాట చెప్పేటప్పటి నిజాయితీ, తీరూ నాకు ఆశ్చర్యం కలిగించాయి. నవ్వూ వచ్చింది.

ఆ రాత్రి వాళ్ళిద్దరూ మా ఇంట్లోనే వున్నారు. భోజనానికి ముందు ఎలా పోగు చేసాడో ఓ పది మంది పిల్లల్ని మా వీధరుగుమీద పోగుజేసి, అతడు ఓ గంటసేపు, వాళ్ళకంటే ఎక్కువగా, వాళ్లతో కలిసి ఆడాడు. మర్రోజు వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

ఆ తర్వాత అతడు రెండేళ్ళ తర్వాత బెజవాడ ప్లాట్‌ఫామ్‌మీద కనిపించాడు. మనిషి బాగా సన్నబడ్డాడు. నన్ను చూడగానే కావలించుకున్నంత పనిచేసాడు. అతనిలో ఉత్సాహం ఉరకలు వేస్తోంది. పిల్ల వుట్టిందంట. బారసాల చేసుకు వస్తున్నాట్ట. గుప్పెళ్ళు ముడిచి, అస్తమాటూ నిద్రపోతుందట గానీ, తెరిస్తే కళ్ళు చాలా పెద్దవిట. నిద్రలో కూడా నవ్వుతుందిట. చివరిగా 'ఎంత ముద్దొస్తూందనుకున్నారు. నా పోలిక రాలేదు లెండి. చాలా చక్కగా వుంది లెండి' అన్నాడు.

అతని ఆనంధం చూస్తూంటే నాకు చాలా సంతోషమైంది.

... ఆ తర్వాత ఓ సంవత్సరానికి రాజమండ్రి సినిమాహాల్లో కనిపించాడు.

'పాప ఏమంటోంది?' అన్నాను.

'ఎన్ని కబుర్లు చెబుతూందనుకున్నారు? మా అమ్మ చేయించిన గొలుసు నోట్లో పెట్టుకొని భలే ఆనందంగా ఆడుకుంటుంది లెండి. గొలుసు నోట్లోంచి తీసేస్తే ఎంత ఏడుపనుకున్నారు– నిజం కాదండీ ఉత్తి దొంగ ఏడుపు. భలే దొంగ, చిన్నప్పుడు సన్నగా వుండేదండీ, ఐదో నెల వచ్చేసరికి బంతిలా ఐపోయిందండీ. ఈ మధ్యనే గాజులు చేయించాము– పొట్లాం లాంటి చేతులకి భలే వున్నాయి లెండి...'

అతను చెప్పే విషయం కన్నా అతని ధోరణి నన్ను ఆకర్షించింది. ఆ ధోరణిలో అడ్డు వున్న తెర తొలగించి, స్పష్టంగా కనుపింపచేసేదేదో వుంది. నా కళ్ళ ముందు ఓ చిన్నపిల్ల ఆకృతి అతి మనోహరంగా సుస్పష్టంగా కనిపిస్తోంది.

ఆ తరువాత రెండేళ్ళకు ఓ పెళ్ళిలో కనబడ్డాడు.

'బాగా అల్లరి చేస్తోందా పాప?' అన్నాను.

'ఎంత ముద్దుగా అల్లరి చేస్తుందనుకున్నారు లక్ష్మి! మాటలన్నీ వచ్చేసాయి. వంటింట్లో మహా హడావిడి అనుకోండి...'

'పాప ఫోటో ఏదైనా వుందా?'

'ఉందండీ. మీ దగ్గర వుంచండి' అంటూ పర్సు అరలన్నీ వెతికాడు. కనబడలేదు. 'అయ్యో! మరచిపోయినట్టున్నారండీ...'

మూడేళ్ళ తర్వాత మెద్రాస్‌లో కనబడి వాళ్ళ అమ్మాయి చదువూ, పొట్టి పరికిణీ కట్టుకుంటే వాళ్ళ లక్ష్మి అందం, పుస్తకాల సంచీ తీసుకు స్కూలుకు వెళ్లడం అన్నీ చెప్పాడు.

ఆ తర్వాత నాలుగైదేళ్ళ దాకా అతను నాకు కనబడలేదు. నా మనసులో ఆ పిల్ల రూపం నిలిచిపోయింది. పాప కబుర్లూ, ఎదగడం ఈ మధ్య వినక నాకు తోచేది కాదు. ఆ పాపని నేను చూడకపోయినా పుట్టిన లగాయతు ఆ పాప చేష్టలూ, విద్దెలు , ఆటలు, ముద్దు మాటలతో పాటు స్పష్టమైన ఓ మోహన రూపం నా మనసులో మెదులుతూ వుండేది. ఆ పాప గురించి ఈ మధ్య ఏం తెలీకపోవడంతో నాకు ఆతృత లాంటిది కలిగి, పెరిగింది. ఒకసారి 'కేంప్'లో వుండగా కామేశానికి ఉత్తరం వ్రాసాను– కాని అతను ఉండేది ఎక్కడ ఆ చిరునామా దొరక్క ఆ కార్డు ఈ నాటికీ నా పెట్టెలో మూలుగుతోంది.

యూనిక్స్ A.C. ఒబేసిటీ & హెయిర్ వీవింగ్ స్త్రీలకు, పురుషులకు

★హైట్-ఇంక్రీజ్ : (లేటెస్ట్ జర్మనీ టెక్నాలజీ)★ఒబేసిటీ (ఇన్‌స్టంట్ స్లిమ్మింగ్)★హెయిర్ వీవింగ్ ★రిమోవేట్రాన్ (హెయిర్ రిమూవింగ్) ★ఫేస్‌లిఫ్ట్ మరియు బ్రెస్ట్ లిఫ్ట్ ★వార్ట్స్ రిమూవ్ ★పులిపురులు, పుట్టుమచ్చలు తొలగించబడును ★పర్మనెంట్ కాస్మెటిక్ (బ్యూటీస్పాట్, లిప్‌లైనర్, ఐలైనర్)

ఇంకా అన్ని రకములైన అడ్వాన్స్‌డ్ ట్రీట్‌మెంట్ కొరకు సంప్రదించండి

యూనిక్స్ ఒబేసిటీ & హెయిర్ వీవింగ్

★ సాంబశివపేట (కమ్మ సంఘం ఎంట్రన్స్ ఎదుట), 2వ లైన్, నాజ్‌సెంటర్, గుంటూరు-1, ఫోన్: 222584 ★408, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, కమ్మ సంఘం ఎదుట, అమీర్‌పేట, హైదరాబాద్, ఫోన్: 3747121 ★ఎ1, బేస్‌మెంట్ మెడినోవా ఎదురుగా, మినర్వా కాంప్లెక్స్, ఎస్.డి. రోడ్, సికింద్రాబాద్ ★ మోడి జిరాక్స్ కాంప్లెక్స్, సిరిపురం జంక్షన్, విశాఖపట్నం, ఫోన్: 545787 ★ దిల్‌సుఖ్‌నగర్ బస్ డిపో ఎదురుగా, ఆంధ్రా బ్యాంక్‌పైన, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్, ఫోన్: 4064425

అన్నిరకములైన ట్రైనింగ్స్ ఇవ్వబడును. ఫోన్ ద్వారా అపాయింట్‌మెంట్ తీసుకొని కలవండి

ఐదేళ్ళ తర్వాత కామేశ్వర్రావు హఠాత్తుగా కర్నూల్లో కనబడ్డాడు. నా దిగులంతా మాయమయింది.

'పాప కులాసా? బాగా చదువుతోందా?' నా మామూలు ప్రశ్న.

ఆ ప్రశ్న వెనకాల ఎంతో ఆత్రుత.

'క్లాసులో ఫస్టుమార్కులన్నీ దానివే అనుకోండి. అన్ని మార్కులు వద్దే తల్లీ- దిష్టి తగుల్తుందని చెప్తాను కూడానూ! మరిచిపోయానండోయ్! డ్రాయింగ్ చాలా ఇష్టం- బొమ్మలు చక్కగా వేస్తుంది. మీ లాంటి వాళ్ళ దగ్గర ప్రత్యేకంగా నేర్పించి ఆ కళలో మంచి ప్రావీణ్యం తెప్పించాలని వుంది'

'అబ్బే! నాకు మాత్రం అంతగా ఏం వచ్చులెండి'

'అలా అనెయ్యకండి- మీ రామం గారు అప్పట్లో మీ గురించి చెప్పేవారు లెండి. మీరా మధ్య వేసిన చిత్రానికి బహుమతీ వచ్చిదంటగా?'

మాట మార్చాలని 'పాపకు ఆడుకోటానికి ఓ తమ్ముడో, చెల్లెలో వున్నారా?' అన్నాను.

'ఇంకెందుకు లేండి. మా లక్ష్మి మా ఇలవేలుపు'

... 6, 7 సంవత్సరాలు గడిచాయి. ఈ పాటికి పాప మనోహరంగా, ముగ్ధత్వం ఒలికిస్తూ, పుత్తడి బొమ్మల్లే వుంటుందని ఆలోచన.

మా రాధ విశాఖపట్నం మా బంధువుల అమ్మాయి పెళ్ళికి వెళ్ళి వచ్చింది.

ఆ మాటా, ఈ మాటా చెబుతూ 'పెళ్ళికి రమ్మన్నా రాలేదు మీరు. మీ కామేశ్వరరావు గారూ, భార్యా కూడా వచ్చారు పెళ్ళికి' అంది.

'అయితే మరి వాళ్ళ...'

నా ఆసక్తి ఎవరి గురించో మా రాధకు తెలుసు.

నవ్వింది.

మా ఇద్దరకూ తెలిసి, స్థిరపడిన విషయానికి మాటలెందుకు? ఆ నవ్వు చాటున వున్న అగాధం లోతు మాకు తెలుసు. ఎన్ని మాటలో ఆ అగాధాన్ని పూడ్చలేవనీ తెలుసు.

'పాప కూడా వచ్చింది. దంతపు బొమ్మల్లే వుందండీ. వయసులో ఉన్నదేమో, మెరిసిపోతూ వుంది. కాలేజీలో చదువుతోందట, మీరు కూడా వస్తే బావుండేది'

నేను ఏనాడూ చూడని, నా ఊహలో పెరిగి, నా మనసంతా నిండిన పాపకు 'ఆకృతి' ఇవ్వాలనిపించింది. ఏవిటో పిచ్చి!

ఆ తర్వాత మూడేళ్ళకు కామేశ్వర్రావు హైద్రాబాద్‌లో కనిపించేడు.

ఇద్దరం పెద్దవాళ్ళమయిపోతున్నాం. నా జుట్టు తెల్లబడుతోంది. అతని జుట్టు వెనక్కి పోయి నుదురు పెద్దదయింది.

'పాప ఏం చదువుతోంది?'

'మెడిసిన్‌లో జేరిందండీ...'

తెల్లటి చీరలో దంతపు బొమ్మ. చీకటిలో మెరిసే కాంతిపుంజం. ఎడారిలో ఒయాసిస్.

'మీకు మా లక్ష్మిని చూపించాలని వుందండీ. కాని ఇప్పుడు సెలవులు గదా అని 'నార్త్' చూడటానికి వెళ్ళింది. ఢిల్లీలో మేనత్త వుంది...'

నాలుగేళ్ళ తర్వాత నాకు చాలా జబ్బు చేసింది. డాక్టరు విశ్రాంతి కావాలంటాడు. ఏమీ తోచనివ్వని వ్యధ. నా ప్రక్కన దిగులుగా రాధ.

'పాపని చూడాలని వుంది రాధా...'

'రామం గారికి ఉత్తరం రాద్దాం, ఆయనకి తెలిస్తే కామేశం గారి ఎడ్రసు తెప్పించి ఉత్తరం రాద్దాం'

ఎడ్రసు తెప్పించి కామేశ్వర్రావుకు ఉత్తరం వ్రాసాను 'పాపను చూడాలని వుంది. వీలైతే తప్పక తీసుకురండి. పాపకు ఓ చక్కటి బహుమతీ తయారుచేసాను'

రెండు నెలలదాకా ఏ సంగతీ తెలీలేదు. నా వంట్లో అసలు బాగుండలేదు. ఉన్నట్టుండి కామేశ్వర్రావు వచ్చాడు. మనిషి చాలా నీరసించిపోయాడు.

'పాప ఎలా వుంది? రాలేదా?...'

'పాప ఇప్పుడు...'

'మర్చిపోయా... నా మాటగా చెప్పి పాపకీ పుస్తకం ఇయ్యండి' అని పుస్తకం ఇచ్చాను.

పేజీలు తిరగేస్తున్నాడు కామేశ్వరరావు. నా మనసు ప్రశాంతంగా వుంది.

కామేశ్వర్రావు ఆ పుస్తకంలో చూసేది నా మనసులో సినిమారీలు తిరుగుతోంది. చిన్ని, చిన్న బొమ్మల్లో పాపను రూపొందించాను.

చిన్నపాప... బుచ్చి నోటితో, గుప్పెళ్ళు ముడుచుకొని నిద్రపోతున్న దేవుని వరం.

చిన్న గౌనుతో వంటింట్లో అమ్మకు పెద్ద గరిట అందించాలని ఆరాటపడే మూడేళ్ళ పిల్ల.

పొట్టి పరికిణీతో అరుగుమీద ఆటలాడుతున్న బాల.

రెండు జడలతో, పెద్ద కళ్ళతో వింతగా లోకాన్ని చూస్తూ స్కూలుకు వెళ్తున్న పిల్ల.

కొత్తగా యవ్వన ప్రాంగణంలోకి అడుగిడిన ముగ్ధ.

వయసు సంతరించిన లావణ్యంతో, పెద్ద చదువుతో పరిణితి చెందుతున్న జవ్వని.

సరసన వున్న 'అతని' భుజం దగ్గరగా నిలబడి, తనని మెచ్చే విభుని రూపం మనసంతా నిండినట్టు, ఆనందమే తానైనట్టున్న యువతి.

వాళ్ళిద్దరూ పెంచి పోషించిన పూలమొక్కలు... రెండే పూలు.

చివర 'నాపాప- నాఊహ- ఊహే నా ప్రాణం- పాపే నా ఊపిరి' అని నేను వ్రాసింది చదువుతూ కామేశ్వర్రావు కళ్ళు తుడుచుకున్నాడు.

'పాపకు ఆ 'బహుమతి' ఇవ్వండి. మీకంటే ఆ పిల్ల నాకు ఎక్కువని మీకు తెలుసు. అదే చెప్పండి పాపకు' అని నేను ప్రక్కమీద ఒరిగాను. నాకు వంట్లో నీరసంగా వున్నా మనకు అతి ప్రశాంతంగా వుంది. నాకీనాడు ఏ బాధా లేదు, ఇది లేదూ అన్న వ్యధ లేదు.

మా రాధకు అన్నీ తెలుసు. అన్నీ తెలిసి నన్ను అర్థం చేసుకొని నా ఊహాజనిత ఆనందంలో పూర్తిగా పాలు పంచుకుంది.

రాధకు తెలుసు. కామేశ్వర్రావుకు తెలిసినా పైకి చెప్పడు- నా ఈ ఆనందానికీ, పాపలో నా ఈ ఉత్సుకతకూ కారణం.

... కారణం మాకు పిల్లలు లేరు.

* * * * *

ఆ రాత్రి కామేశ్వర్రావు ప్రయాణమై వెళ్తూ కళ్ళల్లో నీళ్ళు నింపుకుని, గొంతులో గాద్గద్యం ఆవహించగా రాధమ్మ గారితో నెమ్మదిగా అంటున్నాడు.

'నాకంటే ఎక్కువగా వారు ఆనందించేవారు. నేను ఏమని చెప్పను? నేనింక ఆపుకోలేక మీతో చెపుతున్నాను. ఆయనతో ఈ సంగతి ఏనాడూ అనొద్దు... 'మీ పాప' మీకూ, మాకూ కూడా ఇకలేదు. క్రితం నెలలో రెండు రోజుల విషజ్వరంతో అంతే అయిపోయింది. ఆ సంగతి తెలిస్తే వారేమవుతారో అని నా భయం.

* * * * *

వారం రోజులకు కామేశ్వర్రావు ఉత్తరం వ్రాసాడు.

'మా లక్ష్మి మీ బహుమతి చూసి ఎంతగా ఆనందించిందో మీకు ఎలా చెప్పగలను? తండ్రిని మించి ప్రేమించే మీకు 'మీ పాప' తనయగా తన ప్రేమ అందజెయ్యమంది...'

ఆ ఉత్తరం చదివి వినిపిస్తూ రాధ నా కళ్ళల్లోకి చూసింది.

నా కళ్ళల్లో వెలుగు. మనసంతా నిండిన అవ్యక్తమైన మాధుర్యం.

... నాకు నిద్ర పట్టింది- చాలా ప్రశాంతమైన, ప్రగాఢమైన నిద్ర.